క్లుప్తంగా

డీలర్లను వేధిస్తున్న రెవెన్యూ అధికారులు

చక్రాయపేట : కూటమి నేతల మాటలు విని చౌకదుకాణం డీలర్లను వేధించడమే రెవెన్యూ అధికారులు పనిగా పెట్టుకున్నారని చక్రాయపేట జడ్పీటీసీ భ్యుదు శివప్రసాదరెడ్డి తెలిపారు. మహదేవపల్లె, నెరుసుపల్లె గ్రామాల డీలర్ల షాపుల వద్దకు నిత్యం వచ్చి బెదిరింపులకు దిగుతూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో విచారిస్తే డీలర్ల పనితీరు తెలుస్తుందని అలా చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అన్యాయంగా డీలర్లను తొలగించాలని చూస్తే కోర్టు మెట్లు ఎక్కుతామని ఆయన హెచ్చరించారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుబడ్డ మద్యం బాటిళ్లు, నిందితుడితో ఏఎస్ఐ ప్రసాద్

వల్లూరు : మండలంలోని దిగువపల్లెలో శనివారం 10 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు. కమలాపురం సీఐ ఎస్కే రోషన్ ఆదేశాల మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి దిగువపల్లెలోని గ్రామ సచివాలయం వెనుక వైపున ఎలాంటి అనుమతులు లేకుండా మద్యాన్ని విక్రయిస్తున్న అదే గ్రామానికి చెందిన రామిరెడ్డిగారి ఓబుల్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుండి అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వరుస చోరీలు



బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్ఐ విష్ణు

పులివెందుల రూరల్ : పట్టణంలోని పాత బస్టాండ్ సమీపం రమణప్పసత్రం పాఠశాల ఎదురుగా ఉన్న కూల్‌డ్రింక్ షాపు జ్యూస్ సెంటర్‌లో వరుస చోరీలు జరుగుతుండటంతో పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారుల్లోనే వరుసగా చోరీలు జరుగుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం రాత్రి కూడా రమణప్పసత్రం పాఠశాల ఎదురుగా ఉన్న కూల్ డ్రింక్ షాపులో కిటికీలు పగులగొట్టి రూ.6వేల నగదుతోపాటు సిగరెట్లను అపహరించుకపోయారని బాధితురాలు వాపోతోంది. ఎస్ఐ విష్ణు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

మహిళకు గాయాలు

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : ఊటుకూరు రింగ్ రోడ్ సర్కిల్ సమీపంలో గోపాల్ పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్ వద్ద శనివారం సాయంత్రం జాతీయ రహదారిని దాటుతున్న మహిళను కడప వైపు నుంచి వేగంగా వస్తున్న బైకు ఢీకొనడంతో గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బ్లూకోల్ట్ పోలీసు వచ్చి స్థానికుల సహాయంతో గాయపడ్డ మహిళను ఆటోలో ఆసుపత్రికి తరలించి, బైకు చోదకుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడ్డ మహిళ సమీపంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన నాగమల్లమ్మగా స్థానికులు గుర్తించారు.

బాల్యవివాహం అడ్డగింత

ముద్దనూరు : మండలంలోని కొత్తచౌటపల్లె గ్రామంలో బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు గ్రామంలోని ఓ బాలికకు ఇష్టం లేకున్నా వివాహం చేయడానికి శనివారం నిశ్చితార్థం ఏర్పాటు చేశారు. తనకు ఇష్టం లేకున్నా వివాహం చేస్తున్నారని బాలిక తరుపున జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందింది. స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని నిశ్చితార్థాన్ని ఆపివేయాలని సూచించారు. అనంతరం బాలిక తల్లితండ్రులకు, బంధువులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

బలహీన వర్గాలకు ఉచితంగా సేవలు అందించాలి



మాట్లాడుతున్న జడ్జి ఎస్.భార్గవి

జమ్మలమడుగు రూరల్ : సమాజంలో పేదలకు, బలహీన వర్గాలకు ఉచితంగా న్యాయ సేవలు అందించాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. శనివారం కోర్టులో న్యాయసేవల దినోత్సవం సందర్భంగా న్యాయవాదులతో కలసి ఆమె న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి మాట్లాడారు. న్యాయపరమైన అవగాహన ద్వారా అట్టడుగు ఉన్న వారికి సుప్రీంకోర్టు 1995 సంవత్సరంలో న్యాయసేవల దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు, వికలాంగులు, షెడ్యూల్డ్ తెగలు, పిల్లలు, షెడ్యూల్డ్ కులాలు, మానవ అక్రమ రవాణా బాధితులు అలాగే ప్రకృతి వైపరీత్యాల బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించాలని ఆమె సూచించారు. డిసెంబర్ 14వ తేదీ జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మార్కెట్‌లో పెరిగిన ఉల్లి ధరలు

- క్వింటా రూ.3 వేల నుంచి రూ.4 వేలతో కొనుగోలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉల్లి రైతులు



ఉల్లిగడ్డలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

వేముల : గత నాలుగైదు రోజులుగా మార్కెట్‌లో ఉల్లిగడ్డలు పెరిగాయి. గత వారం రోజుల నుంచి రైతులు దెబ్బతిపడంతో తగ్గిన ధరలు వర్షాల అనంతపురం పుంజుకున్నాయి. బయటి మార్కెట్‌లో ఉల్లిగడ్డలు క్వింటా రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ధరలు ఉండటంతో రైతులు అమ్మివేస్తున్నారు. కొంతమంది రైతులు తాడేపల్లిగూడెం, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటున్నారు. వాతావరణ శాఖ తుఫాన్ ఉంటుందని సమాచారం ఇస్తుండటంతో రైతులు ముందు జాగ్రత్తగా అమ్మివేస్తున్నారు. వర్షాలు అనంతరం పీకిన ఉల్లి గడ్డలు నాణ్యతగా ఉండటంతో ధరలు ఉంటాయని రైతులు అంటున్నారు.

గ్రామాల్లో ముందుకొస్తున్న వ్యాపారులు :
ఉల్లిధరలు మార్కెట్‌లో పెరగడంతో వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ధరలు తగ్గినప్పుడు గ్రామాలకు రానీ వ్యాపారులు ధరలు పెరగగానే ముందుకు వస్తున్నారు. రైతులు కూడా ఉన్న ధరలకు అమ్ముకునేందుకు మొగ్గు చూపుతున్నారు. తుఫాన్‌తో మళ్లీ వర్షాలు వస్తే పీకివేసిన ఉల్లిగడ్డలు తడిచి దెబ్బతింటాయనే రైతులు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ముఖ్యంగా ఆలస్యంగా ఉల్లి సాగు చేసిన రైతులకు ఈ అవకాశం కలిసొచ్చింది. తుఫాన్ సమయంలో దిగుబడులు రాకపోవడంతో కొంతమంది రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాల తర్వాత దిగుబడులు అందడం, మార్కెట్‌లో ధరలు పెరగడంతో రైతులకు ఊరట కలుగుతోంది. ఆలస్యంగా సాగు చేసిన తోటలలో దిగుబడులు అందే సమయానికి ధరలు ఉండటంతో ఆదాయం ఉంటోందని రైతులు అంటున్నారు.



మార్కెట్‌కు సంచులలో నింపిన ఉల్లి గడ్డలు

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు :
మార్కెట్‌లో ఉల్లి ధరలు పెరగడంతో ఉల్లి రైతులలో హర్షం వ్యక్తమవుతోంది. అయితే తుఫాన్ సమయంలో కొంతమంది ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉల్లిగడ్డలు పీకివేశాక మార్కెట్‌లో ధరలు తగ్గడం, వ్యాపారులు కొనుగోళ్లకు ముందుకు రాకపోవడం గడ్డలు దెబ్బతినడం తదితర కారణాలతో ఉల్లి రైతులు నష్టాలనే చవిచూశారు. అయితే ప్రస్తుతం తోటలలో ఉల్లిగడ్డలను పీకివేస్తున్న రైతులకు ధరలు పెరగడంతో ఊరట కలుగుతోంది. సాగులో పెట్టిన పెట్టుబడులు కూడా రావని ఆందోళన చెందిన రైతులకు మార్కెట్ ధరలు ఊపిరిపోశాయి. తుఫాన్‌తో పడిపోయిన ఉల్లి ధరలు మళ్లీ పెరుగుతాయనే ఆశ రైతులలో సన్నగిల్లింది. అయితే మార్కెట్‌లో ధరలు పెరుగుదల ఉల్లి రైతులను నష్టాలనుంచి లాభాల బాటలో నిలబెట్టాయనే చెప్పవచ్చు.

క్వింటా రూ.3,850లతో అమ్మివేశా



నాకున్న 5 ఎకరాలలో ఉల్లి సాగు చేశా. ఆలస్యంగా సాగు చేయడంతో తుఫాన్ నుంచి బయటపడ్డా. ఉల్లి గడ్డలు పీకే సమయానికి మార్కెట్‌ధరలు పెరిగాయి. క్వింటా రూ.3850లతో అమ్మివేశా. ధరలు పెరగడంతో నష్టాలనుంచి బయటపడ్డా. ధరలు పెరుగుదలతో ఆదాయం వచ్చింది.

– చంద్రఓబుళరెడ్డి, రైతు, గొందిపల్లె

పెట్టుబడులతో నలిగిపోతున్నాం



ఉల్లి సాగులో పెట్టుబడులతో నలిగిపోతున్నాం. తుఫాన్ సమయంలో పడిపోయిన ధరలు మళ్లీ పుంజుకుంటాయనే ఆశలేకుండా పోయింది. మార్కెట్‌లో ధరలు పెరగడంతో ఉల్లి గడ్డలను అమ్ముకుంటున్నాం. తోటలలో ఉల్లి గడ్డలు అందే సమయానికి ధరలు పుంజుకోవడంతో నష్టాల నుంచి బయటపడుతున్నాం. అప్పటి ధరలు ఉంటే తీవ్రంగా నష్టపోయేవాళ్లం.

– రంగారెడ్డి, రైతు, గొందిపల్లె

రేపు ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రిలో ఆదివారం ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలిస్తారన్నారు. షుగర్ పరీక్షలు చేయించాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9703622831, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అంకాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు



వైఎస్ మధురెడ్డిని సత్కరిస్తున్న ఆలయ అర్చకులు

తొండూరు : మండలంలోని ఇనగలూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మ ఆలయానికి శనివారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తాలుకా ప్రధాన కార్యదర్శి యాడికి దశరథరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో కలిసి నిద్రిస్తున్న గురుకుల పాఠశాల జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ

పులివెందుల రూరల్ : గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని గురుకుల పాఠశాల జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం రాత్రి పులివెందుల మండల పరిధిలోని బెస్తవారిపల్లె గ్రామ సమీపంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలోని వసతి సముదాయాలను, శుభ్రతను, భద్రతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న విద్యార్థులతో కలిసి రాత్రి పడుకున్నారు. శనివారం ఉదయం విద్యార్థులతో కలిసి మాట్లాడారు. అనంతరం ఆయన ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో అధ్యాపకులు, ఉపాధ్యాయులతో పలు విషయాలపై చర్చించారు. ఫలితాలకు సంబంధించిన ఇంటర్మీడియట్ ఫలితాలు తక్కువగా ఉన్నాయని, రాబోయే పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించే విధంగా విద్యార్థులకు బోధనలను బోధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగాల : మండలంలోని మురారిచింతల, అంబకపల్లె, హిరోజ్‌పురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలపివేస్తున్నామని విద్యుత్ ఏఈ రమేష్‌బాబు తెలిపారు. ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మెయింటెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. ఈ విషయాన్ని ప్రజలు, రైతులు గమనించి సహకరించాలన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వివిధ రికార్డులను తనిఖీ చేసి, అక్కడ అందజేస్తున్న సేవలను పరిశీలించారు. రక్త పరీక్షల విభాగాన్ని, ఫార్మసీ విభాగాన్ని సందర్శించి అవసరమైన సూచనలు చేశారు. ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించి గర్భిణులకు అందజేస్తున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేసి స్థానిక వైద్యులు డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సునీత, సిబ్బందిని అభినందించారు. అలాగే అదే ఆవరణలో నూతనంగా నిర్మితమవుతున్న కేంద్రీకృత రక్తపరీక్షల భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు హర్షిత, సమాజ ఆరోగ్య అధికారి సుకుమార్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పద్యపోటీలకు విద్యార్థినులు ఎంపిక

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నతపాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు జిల్లా స్థాయి వేమన పద్య పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అవుల శ్రీనివాసులు తెలిపారు. డివిజన్ స్థాయిలో శనివారం ప్రొద్దుటూరులో జరిగిన వేమన పద్యపోటీలలో మొత్తం 450 మంది విద్యార్థినులు పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలలో 9వ తరగతికి చెందిన మౌనిక, గంగా జగదీశ్వరి, 8వ తరగతికి చెందిన సుమ అఖిల జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. మొత్తం పాఠశాల నుంచి 13 మంది పోటీల్లో పాల్గొన్నారని ఇందులో సుమ అఖిల తృతీయ స్థానంలో నిలిచి రూ.2వేల నగదు బహుమతి పొందినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

శ్రీవేంకటరమణుడికి పుష్పాభిషేకం



పుష్పార్చనలో సతీసమేత శ్రీవేంకటరమణుడు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పాత బస్టాండులో ఉన్న శ్రీవేంకటరమణుడి ఆలయంలో శనివారం శ్రీవెంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు స్వామివారిని సతీసమేతంగా కొలువుతీర్చి రకరకాల పువ్వులతో పుష్పార్చన నిర్వహించారు. పుష్పార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ దేవదేవుడిని ఆరాధిస్తూ నమస్కరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రూ. 5 లక్షలు మంజూరు చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

వేంపల్లె : పేదలు ఇంటి నిర్మాణాలు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ప్రజలతో కలిసి ఆందోళన చేసి అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 18న గ్రామ సచివాలయాల వద్ద ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలకు గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు లబ్ధిదారులకు మంజూరు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంట్లు పట్టణాల్లో, ఒక సెంటు చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ హామీని నిలబెట్టుకుంటూ ఇసుక, ఇటుక, సిమెంటు, కంకర, ఇనుము ధరలు పెరిగిన రీత్యా గృహ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా నాయకులు చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



అదుపుతప్పి గుంతలో పడిన కారు



గాయపడిన మధుసూదన్‌రెడ్డి

వేముల : మండలంలోని గొందిపల్లె గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పులివెందుల చెందిన మధుసూదన్‌రెడ్డి సొంత పనినిమిత్తం శనివారం కారులో తిరుపతికి వెళ్లి తిరిగివస్తుండగా గొందిపల్లి సమీపానికి రాగానే కారు అదుపుతప్పి బ్రిడ్జి వద్ద గుంతలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కడపకు తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య



శ్రావణ్ కుమార్(ఫైల్)

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలోని వాసవి కాలనీలో శ్రావణ్ కుమార్ అనే వ్యక్తి శనివారం రాత్రి ఇంటిలో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

18 ఏళ్లు పైబడిన వారికి ఉచితంగా స్క్రీనింగ్ చేయాలి



మాట్లాడుతున్న తాళ్లపల్లె పీహెచ్‌సీ డాక్టర్ స్వాతిసాయి

వేంపల్లె : మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం పీహెచ్‌సీ సిబ్బందికి క్యాన్సర్ అవగాహనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ డాక్టర్ స్వాతిసాయి క్యాన్సర్‌పై పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి 18 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులకు స్క్రీనింగ్ చేయాలని సూచించారు. ఈనెల 14 నుంచి నోరు, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వారం క్యాన్సర్ కు సంబంధించి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీంతో క్యాన్సర్ నుండి రక్షణ పొందవచ్చునన్నారు. ప్రజలకు కూడా అందుకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ షఫిఉన్నిషా బేగం, సూపర్ వైజర్ ఫక్రుద్దీన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి గౌరిదేవి కార్తిక మహోత్సవాలు



గౌరిదేవి అమ్మవారు

వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీ గౌరీదేవి ఆలయంలో సోమవారం నుంచి కార్తిక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు కలశస్థాపన, గణపతి పూజ, పుణ్య వచనంలతో కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఆలయ అర్చకులు శంకర మంచి ప్రసాద్‌శర్మ నేతృత్వంలో అభిషేకాలు, కుంకుమార్చన, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 15వ తేదీ శుక్రవారం కార్తిక పౌర్ణమి వరకు గౌరిదేవి వివిధ ఆలకరణలతో దర్శనమిస్తుందన్నారు. శనివారం పసుపు ప్రతిమతో తయారు చేసిన గౌరిదేవి అమ్మవారిని మఠం వీధిలో ఉన్న వృషభాచలేశ్వరస్వామి ఆలయంకు చెందిన పుష్కరిణిలో నిమజ్జనం చేస్తారని, 5 రోజుల పాటు ఉభయదారులచే పూజలు ఉంటాయన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం ఉంటుందని తెలిపారు.

ఇలాగైతే ఎలా..



ఎదురెదురుగా ఆర్టీసీ బస్సులు వెళుతుండటంతో నిలిచిపోయిన ట్రాఫిక్

పట్టణంలోని పాత బస్టాండు, శ్రీరామా హాలు, బైపాస్ రోడ్డులలో నిత్యం వాహనాల రద్దీ పెరుగుతోంది. శ్రీరామా హాలు రోడ్డులో దుకాణాలకు ముందు అటు వైపు, ఇటు వైపు వాహనాలు ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో ఆర్టీసీ బస్సులు సైతం ట్రాఫిక్ నియమాలు పాటించకుండా పోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. వాహనాలు, ఆర్టీసీ బస్సులు వేగంగా వెళుతుండటంతో దుకాణదారులు, పాదాచారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్రీరామా హాలు, బైపాస్ రోడ్డులలో ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

– పులివెందుల రూరల్

నిర్లక్ష్యం చెట్టై..



మిట్టమల్లేశ్వరస్వామి పాఠశాల భవనాలపై పెరిగిన చెట్టు

పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో అధికారుల నిర్లక్ష్యంవల్ల మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. సాధారణంగా మొక్కలు భూమి మీద పెరిగితే బాగుంటుంది కానీ.. కార్యాలయాలపైన, ప్రభుత్వ పాఠశాలలపైన పెరుగుతుండటంతో కార్యాలయాలు నెర్రలు చీలి భవనాలు కూలిపోయే అవకాశం ఉంది. పట్టణంలోని స్థానిక, ఎంపీడీఓ, రెవెన్యూ, ఎక్సైజ్, ఫైర్‌స్టేషన్ కార్యాలయాలతోపాటు డిగ్రీ కళాశాల రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాలపై మొక్కలు ఏపుగా పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించిన భవనాలపై మొలిచిన మొక్కలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– పులివెందుల రూరల్

గరండాలు మీద పడి తీవ్రగాయాలు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని గడ్డవీధికి చెందిన ఇమాం హుస్సేన్, తలారి బుజ్జిలు శనివారం గరండాలను దొంగలిస్తుండగా అవి మీద పడి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. ఇమాం హుస్సేన్, తలారి బుజ్జిలు మద్యంకు బానిసలై గడ్డవీధికి వెనుకవైపు ఉన్న పెన్నానదిలోని సత్రం పై కప్పులో ఉన్న గరండాలను దొంగలించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో గడ్డపార తీసుకుని పిల్లర్లు తొలగిస్తుండగా గరండా మీద పడి ఇమాంహుసేన్ కుడికాలు తెగి సంఘటన స్థలంలో పడిపోయింది. అలాగే ఎడమ చేయి విరిగింది. బుజ్జికి కుడి మెకాళ్ల కింద రక్త గాయం, ఎడమ కాలు విరిగింది. వెంటనే స్థానికులు కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో ఇమాంహుసేన్‌ను రిమ్స్‌కు, బుజ్జిని ప్రొద్దుటూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం తగదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని హామీ ఇచ్చిందన్నారు.